క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని తెలుగు పేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో నృసింహ జయంతిని పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఘన మద్దిలేటి, లక్ష్మీనరసింహస్వామి రజతోత్సవ కల్యాణ మహోత్సవంలో భాగంగా నృసింహస్వామి జన్మనక్షత్రం, స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలో శుక్రవారం ఉదయం సుదర్శన హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి అమ్మవార్లకు భక్తులు సామూహిక ఒడి బియ్యం కార్యక్రమం చేపట్టారు. చివరగా మహా మంగళ హారతితో కల్యాణ మహోత్సవం ముగిసింది.

ఘనంగా అబ్దుల్లా స్వామి ఉరుసు



గ్రామోత్సవం చేస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని జూలేపల్లె గ్రామంలో అబ్దుల్లా స్వామి ఉరుసును ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు కులమతాలకు అతీతంగా అబ్దుల్లాస్వామి దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం స్వామి వారి జెండాకు గ్రామోత్సవం జరిపించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని జంబులాపరమేశ్వరి కల్యాణ మండపంలో శుక్రవారం డీఎస్పీ మహేశ్వరరెడ్డి, ఆర్టీఓ శివారెడ్డి ఆటో కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి సోమన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ, ఆర్టీఓ మాట్లాడుతూ నంద్యాల నుంచి పాణ్యం వరకు తిరిగే ఆటో కార్మికులు మంచి నైపుణ్యం కలిగి ఉన్నార న్నారు. అన్ని సెంటర్లలోని ఆటో కార్మికులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆకతాయిలు ఆటోలను బాడుగకు తీసుకొని అరాచకాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, నారాయణరెడ్డి, రమేష్, కార్మికులు కోటేశ్వరరావు, హుసేన్, కుళాయి, మహేష్, రంగ, మద్దిలేటి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆళ్లగడ్డ: ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజు శుక్రవారం తెలిపారు. విద్యార్థులు 31-08-2013 మధ్య జన్మించిన ఉండాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2021-22, 2022-23 మధ్య 5వ తరగతి పూర్తి చేసిన వారై ఉండాలని, ఈ నెల 9వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఆన్‌లైన్‌లో పొదుపు సంఘాల సమాచారం

శిరివెళ్ల: ఇక నుంచి పొదుపు సంఘాల సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని వెలుగు ఏపీఎం పుణ్యవతి తెలిపారు. శుక్రవారం మహిళా సంఘాల లీడర్లకు లోకోస్ యాప్‌పై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఆమె మాట్లాడుతూ చిన్న, గ్రామ, మండల సంఘాల సమాచారాలు, ఆర్థిక లావాదేవీలన్నీ లోకోస్ యాప్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు. యాప్‌పై సిబ్బందికి అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇస్తున్నామన్నారు. సీసీలు, బీఓఏలు పాల్గొన్నారు.

వేడుకగా సత్య నారాయణ స్వామి కల్యాణం



కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని కోట వీధిలో వెలసిన శ్రీ రమా సమేత సత్య నారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం వ్రత సహిత కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం 5గంటలకు స్వామి వారికి విశేష పంచామృతాభిషేకం, 6.30 గంటలకు సామూహిక ఉచిత సత్యనారాయణ వ్రతాలు, 11 గంటలకు స్వామి నక్షత్రం, అభిజిత్ లగ్నంలో కల్యాణం, 12గంటలకు మహా మంగళ హారతి, మధ్యాహ్నం 1గంటకు అన్నదానం, సాయంత్రం 5గంటలకు గ్రామోత్సవం చేపట్టారు.

ఆపత్కాలంలో బాధితులకు అండగా నిలుస్తూ.. దౌర్జన్యకారుల పనిపట్టేందుకు ప్రభుత్వం దిశ యాప్ అందుబాటులోకి తెచ్చింది. అత్యవసర సమయాల్లో మొబైల్ ఫోన్‌లోని దిశ యాప్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే చాలు పోలీసులకు ఘటనా స్థలంతో పాటు సమాచారం చేరిపోతుంది. దీంతో రక్షకభటులు క్షణాల్లో అక్కడికి వాలిపోయి బాధితులను రక్షించి నిందితులపై చర్యలు తీసుకుంటున్నారు.

తల్లి, బిడ్డలను రక్షించారు..
నంద్యాల మండలం, చాపిరేవుల గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి భర్త ప్రమాదవశాత్తు కుందూ నదిలో పడి మృతి చెందాడు. కుటుంబాన్ని పోషించుకోలేక, కుటుంబ పెద్దను కోల్పోయిన బాధను దిగమింగుకోలేక ఆమె..గతేడాది ఏప్రిల్ 9న గాజులపల్లి సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో తనతో పాటు ఇద్దరు పిల్లలకు పురుగు మందు తాగించింది. అయితే కొంత సమయానికి తేరుకొని ఎలాగైనా బతకాలనే ఆశ మొదలైంది. చుట్టూ చూస్తే ఎవరూ లేరు. తాను పోయినా.. పిల్లలనైనా బతికించుకోవాలనుకుంది. ఇంతలో దిశ గుర్తుకొచ్చింది. వెంటనే మొబైల్ తీసుకొని పరిశీలించగా సిగ్నల్ అందలేదు. దిక్కుతోచని స్థితిలో ఎస్ఓఎస్ బటన్ నొక్కి సొమ్మసిల్లి పడిపోయింది. అయితే కేవలం ఐదు నిమిషాల్లో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అటవీ ప్రాంతంలో చెట్ల పొదల్లో పడిపోయిన తల్లి, ఇద్దరు పిల్లలను పోలీసులు తమ వాహనంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారు ప్రాణాలతో బయటపడిన తర్వాత అప్పటి జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప ఆసుపత్రికి చేరుకొని పోలీసుల తరఫున ఆర్థిక సాయం అందించారు. ఇలా ఎంతో మంది బాధితులను పోలీసులు రక్షించారు.

రామబాణం

- మహిళల రక్షణకు 'దిశ' యాప్
- ఎస్ఓఎస్ బటన్ నొక్కితే.. క్షణాల్లో స్పందిస్తున్న పోలీసులు
- ఆపత్కాలంలో నిమిషాల్లో వాలిపోతున్న ఖాకీలు
- యాప్ రిజిస్టర్ చేసి.. అవగాహన కల్పిస్తున్న రక్షకభటులు



బొమ్మలసత్రం వద్ద మహిళకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎస్పీ (ఫైల్)

బొమ్మలసత్రం: దిశ యాప్ మహిళ తన మొబైల్‌లో ఒక్కసారి రిజిస్టర్ చేసుకుంటే చేతిలో రామబాణం ఉన్నట్లే . అత్యవసర, ఆపద సమయంలో యాప్‌లో ఉన్న ఎస్ఓఎస్ బటన్ నొక్కగానే క్షణాల్లోనే పోలీసులు బాధితుల వద్ద వాలిపోతారు. వారికి ఎదురైన సమస్య తెలుసుకుని అక్కడి నుంచి క్షేమంగా ఇంటికి చేరుస్తారు. ఇందు కోసం వందల సంఖ్యలో పోలీసులు దిశ యాప్ కోసం పనిచేస్తున్నారు. ఆపత్కాలంలో బాధిత మహిళలను రక్షించేందుకు ఎక్కడికక్కడ ప్రత్యేక బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీరిని రాత్రింబవళ్లు పనిచేసేలా చర్యలు చేపట్టింది. అధునాతన టెక్నాలజీని వినియోగిస్తూ పోలీసులు అత్యవసర సమయాల్లో వ్యవహరించాల్సిన తీరు, చేపట్టాల్సిన చర్యలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థినులు, గృహిణులు, ఉద్యోగినులు, మహిళా కూలీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించి, రిజిష్టర్ చేస్తున్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న, డీఈఓ (ఫైల్)

మహిళలకు అవగాహన..
నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మహిళలకు పోలీసులు దిశ యాప్ పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, కోచింగ్ సెంటర్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్, కూరగాయల మార్కెట్లలో మహిళల మొబైల్ ఫోన్‌లో దిశ యాప్ రిజిష్టర్ చేసి యాప్ వినియోగం, లాభాలను వివరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 77,603 మంది మహిళలు యాప్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 27,987 మంది మహిళలను రిజిష్టర్ చేయగా ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో 15,485 మంది , డోన్ సబ్‌డివిజన్‌లో 22,013 మంది, ఆత్మకూరు సబ్ డివిజన్లో 13,105 మంది రిజిస్ట్రేషన్ చేయించున్నారు.

మహిళలకు రక్షణ కవచం



మహిళలపై జరుగుతున్న దాడులను నివారించేందుకు ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకొచ్చింది. దిశ కేసులు కోర్టుల్లో త్వరితగతిన విచారణ పూర్తయి నేరం చేసిన వారికి శిక్షలు పడుతున్నాయి. మహిళలపై నేరాలకు పాల్పడాలంటే నేరస్తులు భయపడాల్సి వస్తుంది. వారికి దిశ చట్టం ఒక కవచంలా ఉపయోగపడుతుంది. –ఫణీంద్రనాథ్, న్యాయవాది

ప్రతి మహిళా దిశ యాప్ రిజిష్టర్ చేసుకోవాలి



ప్రతి మహిళ దిశయాప్‌ను తమ సెల్ ఫోన్‌లో రిజిష్టర్ చేసుకోవాలి. ఆపద సమయంలో ఒక్కసారి ఎస్ఓఎస్ బటన్ నొక్కితే క్షణాల్లో పోలీసులు వారి వద్దకు చేరుతారు. ఇప్పటికే ఎంతో మంది మహిళలు దిశ యాప్ ద్వారా రక్షించబడ్డారు. ప్రతి గృహిణి, విద్యార్థిని, ఉద్యోగినులు తప్పకుండా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ప్రభుత్వం దిశ యాప్ కోసం ఎన్నో బృందాలను అందుబాటులో ఉంచింది. వారు మహిళలకు రక్షణగా పనిచేస్తున్నారు.
– రఘువీర్‌రెడ్డి,నంద్యాల జిల్లా ఎస్పీ

బియ్యం అక్రమ రవాణాను అరికట్టకపోతే చర్యలు

నంద్యాల: రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్ఓ కామేశ్వరరావుతో కలిసి మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మైనింగ్ మాఫియాను నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డివిజన్, మండల స్థాయిలో పోలీసు, రెవెన్యూ అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి అక్రమ మైనింగ్ ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్డీఓ, ఏసీడీపీఓలకు సూచించారు.

పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోండి
జిల్లాలో ప్రాచీన సంప్రదాయాలు ఉట్టిపడేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ టూరిజం అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో పర్యాటక అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రాచీన కట్టడాలను గుర్తించి భవిష్యత్ తరాలకు తెలియజేసేలా హెరిటేజ్ బిల్డింగ్‌గా రూపొందించి పర్యాటకులను ఆకర్షించే రీతిలో నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. దేవదాయ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో టూర్ ప్యాకేజీలకు సంబంధించి ప్రణాళికను రూపొందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి, పర్యాటక ప్రాంతీయ సంచాలకులు రామచంద్ర, టూరిజం అధికారి సత్యనారాయణ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, సోషల్ ఫారెస్ట్రీ, ఆర్కియాలజీ, స్పోర్ట్స్, ఏపీటీడీసీ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో ఉపయోగం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కాంతరావునాయక్

గోస్పాడు: గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ కాంతరావునాయక్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జూలేపల్లె విలేజ్ హెల్త్, వెల్నెస్ సెంటర్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఈ వైద్యశాలలను ఏర్పాటు చేసిందన్నారు. వాటి ద్వారా టెలిమెడిసిన్ సేవలు, 14 రకాల ల్యాబ్ పరీక్షల ద్వారా వ్యాధుల నిర్ధారణ, 67 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని చెప్పారు. గతంలో వ్యాధి నిర్ధారణ జరిగి, మధుమేహం, హైపర్ టెన్షన్, థైరాయిడ్, రక్తహీనత, మూర్ఛ, పక్షవాతం వంటి వ్యాధులతో చికిత్సలు పొందుతూ మందులు వాడుతున్న వారికి ఇక్కడే మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. అనంతరం రోగులను అడిగి సేవల గురించి తెలుసుకున్నారు.

కళలతో మానసిక వికాసం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): కళలు బాలల్లో మానసిక వికాసానికి దోహదం చేస్తాయని, తద్వారా చదువులో రాణించడానికి వీలుంటుందని కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ తెలిపారు. స్థానిక కేఎస్ఎం పురపాలక పాఠశాల ఆవరణలో ఉచిత లలిత కళల, క్రీడల శిక్షణ శిబిరాన్ని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మధుసూధన్‌రావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. రవికృష్ణ మాట్లాడుతూ 23 ఏళ్లుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ నెల 30వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఇందులో శాస్త్రీయ నృత్యం, ఆధునిక నృత్యం, శాస్త్రీయ, లలిత సంగీతం, మిమిక్రీ, చిత్రలేఖనం, హస్తకళలు తదితర అంశాల్లో 25 మంది కోచ్‌లతో శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 31న టౌన్ హాల్‌లో జరిగే ముగింపు ఉత్సవంలో శిక్షణ పొందిన బాల బాలికలతో ప్రదర్శన ఏర్పాటు చేస్తామని చెప్పారు. యువజన విభాగం అధ్యక్షుడు రంగనాథ్, కోచ్‌లు కళ్యాణి, లలితాసరస్వతి, సుహాసిని, రాజా, ఆది, మధు పాల్గొన్నారు.

పీఎండీఎస్ సాగుపై అవగాహన

ఆళ్లగడ్డ: ప్రకృతి వ్యవసాయ విధానంలో పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) యాజమాన్య పద్ధతులపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. రూరల్ మండలం అహోబిలం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలో నవధాన్యాల సాగు, నేలతల్లి బాగు కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ పద్ధతిలో ప్రధాన పంట కంటే ముందు ప్రతి రైతు 20 నుంచి 30రకాల విత్తనాలను తొలకరి చినుకులకు ముందు పొలంలో చల్లుకోవాలని సూచించారు. ఇలా చల్లుకోవడం వల్ల భూసారం, కార్బన శాతం పెరిగి నేల కోతకు గురి కాదని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆరోగ్యమయ్య, సచివాలయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

నంద్యాల(సిటీ): పట్టణంలోని 24, 26వ వార్డు సచివాలయాలను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు, సిబ్బంది మూవ్‌మెంట్ రిజిష్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వీఆర్ఓ జి.శ్రీనివాసులు వేతనంలో 3 రోజుల వేతనం కోత విధిస్తున్నామన్నారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చర్యలకు ఉపక్రమించినట్లు చెప్పారు.

బంగారు భవిష్యత్‌కు పునాది 'పాలిటెక్నిక్'

- మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి
- ఎమ్మెల్యే శిల్పా రవి



ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పాలిటెక్నిక్ దోహదం చేస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. దశాబ్దాల క్రితం ఏర్పాటైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, త్వరలో నంద్యాలలో మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. పట్టణంలోని ఈఎస్‌సి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ అధ్యక్షత శుక్రవారం ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమెల్యే హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తుందన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి గాను పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న 295 మంది విద్యార్థులకు 14 కంపెనీల క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు పొందడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాల్లో నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈఈఈలో 79 మంది, ఈసీఈ విభాగంలో 71, సివిల్ 17, మెకానికల్ 43 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఉద్యోగాలు పొందిన వారిలో అత్యధికంగా రూ.4 లక్షలు వేతనంతో ఉపాధి పొందారని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావలి, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, షేక్ ఫాతిమాబీ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు



42వ వార్డులో వృద్ధురాలికి పథకాల లబ్ధిని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల/నంద్యాల(రూరల్): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అన్ని వర్గాలకు సక్రమంగా అందుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 42వ వార్డులో కౌన్సిలర్ పిల్లి శిరీషతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి వారికి బ్రోచర్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాలకు మేలు చేకూరేలా సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్ పాంషావలి, వార్డు ఇన్‌చార్జ్ పిల్లి కిరణ్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు పాల్గొన్నారు.

పెద్దకొట్టాలలో..
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, జగనన్న పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలో గ్రామ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని స్థానికులను కోరగా..పలువురు గ్రామంలో నెలకొన్ని సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అక్కడే ఉన్న అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ హయంలో పెన్షన్ల కోసం కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఒకటో తేదీనే, తెల్లవారక ముందే ఇంటి గడప వద్దకు వలంటీర్లు వచ్చి పింఛన్లు అందిస్తున్నారని చెప్పారు. మార్కెట్ యార్డు చైర్మెన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, నంద్యాల మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సిద్దంశివారం, నాయకులు శీలం శివనాగిరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, సర్పంచ్ వెంకటరాముడు, రవి, రవికుమార్‌రెడ్డి, బాలశివారెడ్డి, జగదీశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొట్టాల ఎద్దుల విజయకేతనం

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన న్యూ కేటగిరి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల విజేతగా నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 50 వేలు సొంతం చేసుకున్నాయి. అంతకుముందు జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్ రెడ్డి, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పోటీలను ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం ఫల్కాదొడ్డి గ్రామానికి చెందిన ఖాజాహుసేన్ ఎద్దులు రెండో స్థానంలో నిలిచి రూ. 40 వేలు, నంద్యాల జిల్లా కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి వృషభాలు మూడో స్థానంలో నిలిచి 30 వేలు, నంద్యాల జిల్లా, బేతంచెర్ల మండలం టి. హుసేనాపురం గ్రామానికి చెందిన ఎం రామసుబ్బారెడ్డి ఎద్దులు నాల్గో స్థానంలో నిలిచి రూ. 20 వేలు, పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన నాగార్జున ఎద్దులు ఐదో స్థానంలో నిలిచి రూ. 15 వేలు, గడివేముల మండలం కె. బొల్లవరం గ్రామానికి చెందిన బి. వెంకటరమణ యాదవ్ వృషభాలు ఆరో స్థానంలో నిలిచి రూ. 10వేలు, ప్రకాశం జిల్లా పెద్దరవడు గ్రామానికి చెందిన అల్లు రేవంత్ రెడ్డి ఎద్దులు ఏడో స్థానంలో నిలిచి రూ. 5 వేల నగదు బహుమతులను అందుకున్నాయి. ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, యరభం ప్రభాకర్ రెడ్డి, తువ్వా వెంకటనాగిరెడ్డి పాల్గొన్నారు.

పథకాల అమలులో రాజకీయాలకు తావు లేదు



లబ్ధిదారుడుకి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: గతంలో మాదిరిగా పథకాల అమలులో రాజకీయ పార్టీల ప్రస్తావన లేకుండా కేవలం అర్హత ఆధారంగా పథకాలు వర్తింపజేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం దొర్నిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయా వ్యవస్థ ద్వారా పట్టణాల్లో, గ్రామాల్లో శాశ్వత అభివృద్ధికి చిరునామాలుగా చరిత్రలో నిలిచిపోనున్నాయన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి స్థానిక సచివాలయం-1, 2లలో రూ.40లక్షలతో ఎలాంటి పనులు చేపట్టాలో ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సర్పంచి దేవమణి, వైస్ఎంపీపీ లక్ష్మీదేవి, సచివాలయ మండల కన్వీనర్ శివారెడ్డి, నాయకులు కాకనూరు మనోహర్‌రెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, పయిడేలా శివరామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భూమా శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీపతి ప్రసాద్, వెంకటకుళాయి, బత్తుల రాజు, ఉప సర్పంచ్ లక్ష్మిరెడ్డి, నడిపెన్న, బత్తుల కృష్ణయ్య యాదవ్, పాదం శీను, పీఎంసీ చైర్మన్ నర్సిరెడ్డి, ఎంపీడీఓ నాగఅనసూయ, తహసీల్దార్ జయప్రసాద్, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ సుప్రియ, మండల సర్వేయర్ మల్లయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని విజయభాను కాటన్‌మిల్ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 170 బస్తాల రేషన్ బియ్యాన్ని త్రీటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. కాటన్ మిల్ సమీపంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం మేరకు ఇంట్లో తనిఖీలు చేయగా రేషన్ బియ్యాన్ని గుర్తించామని, నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

జిల్లాలో మోస్తరు వర్షాలు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలోని పలు మండలాల్లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసిందని ఇన్‌చార్జ్ డీఆర్ఓ కామేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అవుకు మండలంలో అత్యధికంగా 45.8 మి.మీ వర్షం కురవగా, డోన్ మండలంలో అత్యల్పంగా 0.6మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ప్యాపిలిలో 20.0, కొలిమిగుండ్లలో 15.0, బనగానపల్లెలో 6.8, కోవెలకుంట్లలో 5.0 మి.మీ వర్షపాతం నమోదైందని చెప్పారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

నంద్యాల(సిటీ): పటణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక 36వ వార్డు కౌన్సిలర్ శిల్పా నాగినిరెడ్డి ఆధ్వర్యంలో వార్డును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఈలు శ్రీనివాసరెడ్డి, శానిటరీసూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాదొడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ



అప్పనపల్లెలో విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

రుద్రవరం: మండలంలోని అప్పనపల్లె గ్రామంలో ఎస్సీ,ఎస్టీ కేసుపై ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య శుక్రవారం విచారణ చేపట్టారు. వారం క్రితం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైందని ఆ కేసుకు సంబంధించి ఆరుగురిని విచారించినట్లు డీఎస్పీ తెలిపారు. అనంతరం ఆయన రుద్రవరం-అప్పనపల్లె గ్రామాల మధ్య వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శిరివెళ్ల సీఐ చంద్రబాబునాయుడు, ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి ఉన్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



నూతనంగా నిర్మించిన శ్రీ ఓంకారేశ్వర్వస్వామి ఆలయం

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఓంకారేశ్వర్వ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. తొలిరోజు గంగా నయనం, గోపూజ, గణపతి పూజ, స్వస్తి, పుణ్యాహవాచనం, నాంది, మాతృకా పూజనం వంటి పూజలతో పాటు గ్రామోత్సవం, చెక్కభజన వంటి కార్యక్రమాలు జరిగాయి. అలాగే శ్రీజ్ఞాన ప్రసాద గురూజీ దివ్యసందేశం, బ్రహ్మశ్రీ డాక్టర్ దివి హయగ్రీవాచార్యులుచే ప్రవచనములు ఆకట్టుకున్నాయి. శనివారం జగద్గురు శంకరాచార్య శ్రీ హంపి విరుపాక్ష పీఠాదీశ్వరులు విద్యారణ్య భారతి ధ్వజ ప్రతిష్ఠ, గణపతి నవగ్రహ, రుద్ర, చండీహోమాలు, ధాన్యాదివాసనం కార్యక్రమాలు చేపడతారని నిర్వాహకులు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



గంజాయి, నిందితులను చూపుతున్న డీఎస్పీ

ఆళ్లగడ్డ: పట్టణ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న వారిని రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ నరసింహులు అరెస్టు చేయగా డీఎస్పీ వెంకటరామయ్య శుక్రవారం కేసు వివరాలను వివరించారు. పెద్దకందుకూరు గ్రామ సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద.. రామలక్ష్మి కొట్టాలకు చెందిన మద్దిలేటి రెడ్డి, బాలుడు, సింగం వీధికి చెందిన రాఘవేంద్ర, దువ్వూరుకు చెందిన దస్తగిరి, చింతకుంటకు చెందిన హుసేన్‌వలి, బాల నరసింహుడు, మర్రిపల్లి రాముడు నుంచి 1,230 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే కొండంపల్లి వద్ద మరికొందరి నుంచి 1,150 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

చర్చి వార్షికోత్సవం

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల సీఎస్ఐ చర్చి ఐదవ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగాయి. పాస్టర్లు డేవిడ్ పుష్పరాజు, కాంతారావు, మధుకర్ ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేసి దైవసందేశం ఇచ్చారు. కంపమల్ల గ్రామానికి చెందిన నంద్యాల మెడికల్ కమిటీ, హరివరం ఫా స్టేట్ కౌన్సిల్ మెంబర్ శ్రీరాముల అబ్రహాంను పాస్టర్లు సత్కరించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం సంఘస్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.ఆయా కార్యక్రమాల్లో సంఘపెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.



అబ్రహాంను సన్మానిస్తున్న పాస్టర్లు